క్లుప్తంగా

26న వాడ్రాపల్లిలో పారిపల్లెమ్మ పండగ



పారిపల్లెమ్మ పండగ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక: ఉత్తరాంధ్రలో పేరుగాంచిన వాడ్రాపల్లి పారిపల్లెమ్మ పండగను ఈ నెల 26న ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను పెద్దలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దలు మళ్ల వరహా నరసింగరావు, సత్యనారాయణ, లీలా భాస్కరరావు, శేషు, కొండబాబు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ మహాసభను విజయవంతం చేయాలి

యలమంచిలి: జిల్లా కేంద్రం అనకాపల్లిలో ఈ నెల 23న నిర్వహించే ఏఐటీయూసీ మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు గనిశెట్టి ఏసుదాసు శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ సమావేశంలో కార్మికుల ఉద్యోగ,సంఘాల సమస్యలుపై చర్చించనున్నట్టు తెలిపారు.

ఆశాజనకంగా వరి సాగు



వాడ్రాపల్లి ఆవ ప్రాంతంలో వరిపైరు

మునగపాక: సకాలంలో వర్షాలు కురవడంతో మండలంలోని పలు గ్రామాల్లో రబీ వరి సాగు ఆశాజనకంగా ఉంది. మండల వ్యాప్తంగా 82 హెక్టార్ల మేర వరి సాగు జరుగుతున్నట్టు అధికారులు తెలిపారు. వాడ్రాపల్లి, తిమ్మరాజుపేట, మునగపాక తదితర ప్రాంతాల్లో వరి పైరు కోత దశకు చేరుకుంటోంది. కోత దశకు వచ్చే వరి పైరు విషయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న కుమారి తెలిపారు.

28న పైడిమాంబ విగ్రహప్రతిష్టాపన



పైడిమాంబ అమ్మవారు

రాంబిల్లి: మండలంలో ప్రసిద్ధి చెందిన మామిడివాడ పైడిమాంబ అమ్మవారి నూతన ఆలయంలో ఈనెల 28న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయం జీర్ణావస్థకు చేరడంతో దాతల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో నూతనంగా తయారు చేసిన అమ్మవారి విగ్రహానికి 28న ప్రతిష్ట చేయనున్నారు.

24న పడమటమ్మలోవలో శాంతి హోమం

కశింకోట: మండలంలోని విసన్నపేట వద్ద వెలసి ఉన్న పడమటమ్మ లోవలో ఈ నెల 24న ఉదయం 10 గంటలకు శాంతి హోమం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు పెనిమిటి సాంబమూర్తి తెలిపారు. పడమటమ్మ ఆలయ ప్రాంగణంలో జరిగే కార్యక్రమానికి హోమ సామగ్రితో భక్తులు పాల్గొనాలని కోరారు.

వడ్డాది వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

బుచ్చెయ్యపేట : వడ్డాది వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఉదయం నుండి రాత్రి వరకు వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం సదస్యం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవితో వేంకటేశ్వరస్వామికి కల్యాణం జరిగి మూడో రోజు కావడంతో రాత్రికి వడ్డాది పుర వీధుల్లో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గజగరుడ వాహనాలపై ఉంచి డప్పులు, వాయిద్యాల ఊరేగించారు. గిరిజాంబ కొండపై ఉత్సవ విగ్రహాలను ఉంచారు. తిరువీధి ఉత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామిని స్తుతించారు. దీంతో గోవింద నామస్మరణ మార్మోగింది.

రేపటి నుంచి గడప గడపకు వైఎస్సార్ సీపీ

- సంక్షేమ పథకాలు వివరిస్తూ ఎన్నికల ప్రచారం
- 24న పాయకరావుపేట నుంచి శ్రీకారం
- జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ, అభ్యర్థి జోగులు



అడ్డురోడ్డులో సమన్వయకర్త క్యాంపు కార్యాలయంలో సమావేశమైన ముఖ్యనేతలు

నక్కపల్లి/ఎస్‌రాయవరం: కొద్దిరోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మరోసారి గడప గడపకు కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నిర్ణయించింది. పాయకరావుపేట నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి ఈనెల 24నుంచి శ్రీకారం చుట్టనున్నట్టు నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. ఈ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించేందుకు అడ్డురోడ్డులో సమన్వయకర్త క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేతలతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ఒక పర్యాయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. ఆ ఉత్సాహంతోనే ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో గడప గడపకు వైఎస్సార్‌సీపీ పేరుతో ఈ నెల 24 నుంచి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఎన్నికల ప్రచారం చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈనెల 24 నుంచి పాయకరావుపేట మండలంలో ఈ ప్రచారం ప్రారంభమవుతుందని తెలిపారు. మొదటిరోజు 24న పాయకరావుపేట మండలం శ్రీరాంపురం, కేశవరం, రాజవరం 25న నక్కపల్లి మండలంలో దేవవరం, వేంపాడు, కాగిత, 26న ఎస్.రాయవరం మండలం జేపీ పాలెం, వేమగిరి, సైతారు పేట, పేటసూదిపురం, 27న కోటవురట్ల మండలం అన్నవరం, యండపల్లి, సుంకపూరు గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. నియోజకవర్గ ముఖ్యనేతలంతా హాజరుకావాలన్నారు. తదుపరి మండలాల వారీగా నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం అభ్యర్థి, మండలస్థాయి ముఖ్యనేతలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తారని తెలిపారు. ప్రజలను ఓటు అడిగే హక్కు ఒక్క వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలన్నీ రద్దు చేస్తారని తెలిపారు. జగనన్న అమలు చేసిన ఒక్క పథకం కూడా కొనసాగించే పరిస్థితి ఉండదని చెప్పారు. చంద్రబాబు, దాని తోకపార్టీ జనసేన కుట్రలను ప్రజలందరికీ వివరించేందుకు మరోసారి గడపగడపకు వెళ్లాలని నిర్ణయించినట్టు వారు తెలిపారు. ఎన్నికల నియమావళికి లోబడి ప్రచారాన్ని నిర్వహించాలని, దీనికి సంబంధించి అన్ని అనుమతులు తీసుకుంటామని చెప్పారు. ఎంఎస్ఎంఈ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాలరామారావు, కాపుకార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎస్.రాయవరం మండల పార్టీ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందులు మాట్లాడుతూ మనమంతా ఒక కుటుంబ సభ్యులమన్నారు. కలిసికట్టుగా ప్రతిపక్ష పార్టీలను ఎదుర్కోవాలని తెలిపారు. జగనన్న పాలనలో అమలు చేసిన పథకాలను టీడీపీ నాయకులు కోర్టులకు వెళ్లి ఏవిధంగా అడ్డుకున్నారో ఈ ఎన్నికల ప్రచారంలో ప్రజలకు వివరిస్తామన్నారు. జగనన్న పథకాలే ప్రధాన ప్రచారాస్త్రాలని తెలిపారు. సమావేశంలో జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు పైల రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, సీనియర్‌నాయకులు దనిశెట్టి బాబూరావు, మధు వర్మ, కర్రి సత్యనారాయణ, శ్రీపతిరాజు, కుమార్‌రాజా పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం



ఎమ్మెల్యే కంబాల జోగులును సత్కరిస్తున్న క్రిస్టియన్ మైనార్టీసెల్ సభ్యులు

ఎస్.రాయవరం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మరోమారు విజయఢంకా మోగించడం ఖాయమని క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌కుమార్ అన్నారు. అడ్డురోడ్డు క్యాంపు కార్యాలయం వద్ద పాయకరావుపేట, ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల మండలాల క్రిస్టియన్ మైనార్టీ సెల్ సభ్యులు ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులను మర్యాద పూర్వకంగా కలిసి, సత్కరించారు. అనంతరం ప్రార్థన చేసి, ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సుధీర్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల వారని ఆదరించిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్, పాయకరావుపేట పార్టీ అధ్యక్షుడు చిక్కాల రామారావు, పార్టీ ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పి.బెంజిమణి, జిల్లా కార్యదర్శి కె.రమేష్,పాయకరావుపేట నియోజకవర్గ నాయకులు పీఐజెవై దానియెల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ట్రైనీ డీఎస్పీ భవ్య



జంపపాలెంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

యలమంచిలి: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని డీఎస్పీ భవ్య, సీఐ షేక్ గఫూర్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు శుక్రవారం కవాతు నిర్వహించాయి.

జంపపాలెంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ కవాతు పెదపల్లి, కొక్కిరాపల్లి, పద్మనాభరాజుపేట, బయ్యవరం, ఏటికొప్పాక గ్రామాల్లో ట్రైనీ డీఎస్పీ భవ్య ,యలమంచిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ గఫూర్,ఎస్ఐ పైలా సింహాచలం పర్యవేక్షణలో సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రజలందరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.

బీజేపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి



సంజీవ్,అనుచరులకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు

యలమంచిలి రూరల్: వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. శుక్రవారం యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు సమక్షంలో పట్టణ బీజేపీ మాజీ జనరల్ సెక్రటరీ గుర్రాల సంజీవ్, అతని అనుచరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై సంజీవ్‌తో పాటు పట్టణంలోని ధర్మవరం వీధికి చెందిన కొఠారు నానాజీ, గొన్నాబత్తుల నాగేశ్వరరావు వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో, నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమన్నారు. ప్రజలంతా మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చూడాలన్న బలమైన కోరికతో ఉన్నారని చెప్పారు.ఏ గ్రామంలో చూసినా 60 నుంచి 80 శాతం మంది వైఎస్సార్‌సీపీకి మద్దతునిస్తున్నారని తెలిపారు.ఎలాంటి వివక్ష చూపకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేయడం వల్లే లబ్ధిదారులంతా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం కడతారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ అధ్యక్షుడు సుకుమార వర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర,మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు సత్యగుప్తా, పార్టీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్ పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

కోటవురట్ల: స్థానిక విద్యా వికాస్ స్కూల్ ఆవరణలో ఈ నెల 24న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆర్డినేటర్ సి.హెచ్.అశ్వనీకుమార్ తెలిపారు. విద్యా వికాస్ స్కూల్ కరస్పాండెంట్ షేక్ పాపా సాహెబ్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ వైద్య నిపుణులు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, కంటి సమస్యలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని, ఆరోగ్యశ్రీకార్డు, ఆధార్‌కార్డు, బ్యాంకు బుక్, రెండు జతల దుస్తులు, రోగి వాడుతున్న మందులు, మొబైల్ ఫోన్ తీసుకురావాలని సూచించారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



మునగపాకలో ప్రారంభమైన పూడిమడక రోడ్డు పనులు

మునగపాక: పూడిమడక రోడ్డు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారి కష్టాలు తొలగిపోనున్నాయి. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలో మీటర్ల రహదారి గోతులమయంగా ఉండడంతో పాటు శిథిలావస్థకు చేరుకున్న సంగతి తెలిసిందే. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు చర్యలు చేపట్టారు. ఈ సమస్యను వీఎంఆర్‌డీఏ దృష్టికి తీసుకెళ్లడంతో రూ.6.5 కోట్లు మంజూరయ్యాయి. ఇటీవల సంబంధిత రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.ఇప్పుడు బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే రమణమూర్తిరాజుకు స్థానికులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఉత్సవం



మలసాల భరత్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ కమిటీ

కశింకోట: మండలంలోని బుచ్చియ్యపేట గ్రామంలో ఆంజనేయస్వామి ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో స్వామికి తమలపాకుల అర్చన, సింధూర అర్చనలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. కమిటీ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో పూలమాల వేసి, జ్ఞాపికను అందించారు. స్వామిని స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. సాయంత్రం తీర్థ మహోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్ శ్యామ్, పార్టీ నాయకులు అద్దెపల్లి శ్రీనివాసరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత



నీటి ప్రాధాన్యతపై అవగాహన ర్యాలీ చేస్తున్న న్యాయమూర్తి సాయికుమారి,అధికారులు



వమ్మవరం పాఠశాలలో విద్యార్థుల ప్రతిజ్ఞలో పాల్గొన్న ఎంపీడీవో సత్యనారాయణ



జల దినోత్సవం అవగాహన కార్యక్రమంలో విద్యార్థులప్రదర్శన

యలమంచిలి రూరల్: జీవరాశి మనుగడకు నీరే ఆధారమని, నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు మున్సిపల్ కార్యాలయ అధికారులు నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. సేవ్ వాటర్ సేవ్ నేచర్ అంటూ నినాదాలు చేశారు.బ్యానర్లు ప్రదర్శించి స్థానికులకు జలసంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో నీటికొరత ఒకటన్నారు. బెంగళూరు సిటీలో నీటి సంక్షోభంతో జల దినోత్సవానికి ప్రాధాన్యత ఏర్పడిందని చెప్పారు. అనంతరం న్యాయస్థానాల ప్రాంగణం వద్ద అవగాహన సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ఎ.కొండలరావు,పట్టణ ఎస్ఐ పాపినాయుడు, న్యాయవాదులు, మునిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: నీటి వనరులను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. ఎన్నికల కోడ్ అమలు తీరు పరిశీలనలో భాగంగా ఆయన వమ్మవరం మోడల్ ప్రైమరీ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ జల దినోత్సవంలో ఆయన పాల్గొని, విద్యార్థులతో పాటు నీటి వనరుల పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాలలో పరిసరాల పరిశుభ్రత, బోధన తీరుపై ఉపాధ్యాయులను అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్‌బాబు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని అధిగమించేందుకు సమష్టి కృషి అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ జగన్నాథరావు

అనకాపల్లి: దేశంలో నీటి ఎద్దడిని అధిగమించడానికి ప్రభుత్వాలు, ఎన్‌జీవోలు, ప్రజలు సమష్టిగా కృషిచేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ఏడీఆర్ డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ నీటిదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటివనరులను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలు నాటితే వాతావరణంలో మార్పులు సంభవించి నీటికొరత తీరుతుందన్నారు. వర్షపునీరు నిల్వ ఉండే విధంగా చెరువులు, జలాశయాలు, నీటిగుంతలను అధికంగా ఏర్పాటు చేయాలని చెప్పారు. బెంగళూరు నీటి సమస్య ఎక్కువగా ఉందని, రానునున్న రోజుల్లో మిగిలిన నగరాల్లో ఇటువంటి సమస్యలు లేకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డి.ఆదిలక్ష్మి, టి.శ్రీలత, డి.ఉమామహేశ్వరరావు, ఎం.విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

చెరకు నరికే యంత్రంపై శిక్షణ

మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాకు స్థానిక ఆర్ఏఆర్ఎస్ పరిధిలో 8మంది చెరకు రైతులను తీసుకుని వెళ్లి చెరకు నరికే యంత్రాలపై శిక్షణ ఇచ్చినట్టు ఏడీఆర్ పి.వి.కె. జగన్నాథరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరకు నరికే యంత్రం ధర సుమారు రూ.60లక్షలు ఉంటుందన్నారు.

చెరకు నరికేందుకు టన్నుకు కూలీలు ద్వారా రూ.1000 ఖర్చు అయితే యంత్రం ద్వారా రూ.400 అవుతుందన్నారు. సోలాపూర్‌లో చెరకు నరికే యంత్రంపై శిక్షణ పొందిన రైతులు సన్యాసినాయుడు, కృష్ణప్రసాద్, ఎం.కృష్ణారావులు మాట్లాడుతూ యంత్రంపై శిక్షణ తీసుకున్నామని, చాలా ఉపయోగకరంగా ఉందని తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తుమ్మపాల: కంటి సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తున్నట్లు శ్రీ చింతామణి గణపతి దత్త క్షేత్రం ట్రస్టీ ఎ.రవికుమార్ అన్నారు. జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లి ప్రాథమిక పాఠశాలలో దత్త క్షేత్రం, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషక ఆహారంతో పాటు ఆకుకూరలు, కంటి సంబంధిత పోషకాలుండే పదార్థాలను విద్యార్థులు ఆహారంలో భాగంగా చేసుకోవాలన్నారు. శంకర్ ఫౌండేషన్ సహకారంతో చూపు మందగించిన విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు అందిస్తామన్నారు. 110 మంది విద్యార్థులకు, 40 మంది గ్రామస్తులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఎం.ఆంజనేయరాజు, ట్రస్ట్ ల్యాండ్ డోనర్ సీపీ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కేజ్రీవాల్ అంటే బీజేపీకి భయం'

అనకాపల్లి: ఢిల్లీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) అధినేత కేజ్రీవాల్ అంటే బీజేపీకి భయమని, ఆయన అన్ని రాష్ట్రాలు తిరిగి, ప్రచారం చేస్తే బీజేపీకి ఎవరూ ఓటేయరనే అక్రమ అరెస్టుకు తెగబడ్డారని ఆప్ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథబాబు శుక్రవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. కేజ్రీవాల్‌తో ప్రత్యక్ష పోరాటం కష్టమని తేలడంతో బీజేపీ దొంగ యుద్ధం చేస్తోందన్నారు. దేశంలో ప్రజాస్వామ్య విలువల్ని పూర్తిగా మంటగలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వార్థపూరిత పార్టీలతో పొత్తులు పెట్టుకుంటూ ఒకపక్క రాష్ట్ర భవిష్యత్తును, మరోపక్క దేశ భవిష్యత్తును నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ అప్రజాస్వామిక విధానాలకు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం



తహసీల్దార్ రవిచంద్ర

రోలుగుంట : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈ ఏడాది నుంచి మంచంపై ఉండి నడవలేని వృద్ధులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయొచ్చనే ఉత్తర్వులు జారీ అయ్యాయని తహసీల్దార్ కె.రవిచంద్ర తెలిపారు. తన కార్యాలయంలో ఆయన శుక్రవారం ఎన్నికల నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ అర్హతల గురించి మాట్లాడారు. ఇప్పటి వరకూ ఉద్యోగులు, దివ్యాంగులకు ఈ విధంగా ఓటు వేసే అవకాశం ఉండేదన్నారు. తాజాగా 85 సంవత్సరాలు దాటి నడవలేని వృద్ధులకు కూడా ఎన్నికల కమీషన్ అటువంటి అవకాశం కల్పించిందన్నారు.

పోస్టల్ బ్యాలెట్ పై సమీక్ష..

పోస్టల్ బ్యాలెట్ అర్హతలు, వినియోగంపై నేడు (శనివారం) చోడవరం పద్మావతి కల్యాణ మండపంలో నియోజకవర్గం ఎన్నికల అధికారి చిన్నికృష్ణ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహిస్తారని తహసీల్దార్ కె.రవిచంద్ర తెలిపారు.

పాఠశాలల్లో విధిగా మెనూ అమలు చేయాలి



విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: మధ్యాహ్న భోజనం మెనూ అమలులో నిబంధనలు పాటించాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు అన్నారు. మండలంలోని వై.బి.అగ్రహారం పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. నిర్వాహకులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించారు. ఎన్నికల సమయం కావడంతో చాలా చోట్ల ఉపాధ్యాయులు మెనూ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటారన్న కారణంగా పాఠశాలలను తనిఖీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హుస్సేన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూలీలందరికీ వంద రోజులు పని కల్పించాలి



కూలీలకు సూచనలిస్తున్న అధికారులు

మాకవరపాలెం: కూలీలందరికీ వంద రో జులు పని కల్పించాలని ఎంపీడీవో చంద్రరావు ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని జి.గంగవరం గ్రామంలో నిరాయపురాజు చెరువులో జరుగుతున్న పూడిక తొలగింపు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్ షీట్లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డులున్న కూలీలందరికీ 100 రోజులు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనికి రాకుండా మస్టర్లు వేస్తే సిబ్బందిపై వేటు తప్పదన్నారు. అలాగే గిట్టుబాటు కూలీ దక్కాలంటే ఎంత మేర పనులు చేయాలో టెక్నికల్ సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు.

పాడి రైతులకు రాయితీ విత్తనాలు



మాట్లాడుతున్న పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్‌కుమార్

కె.కోటపాడు : వేసవిలో పశుగ్రాస సమస్య తలెత్తకుండా పాడి రైతులకు రాయితీపై గడ్డి విత్తనాలు అందించనున్నట్లు కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఇ.దినేష్‌కుమార్ తెలిపారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో గల పశు వైద్యాధికారులు, పశు వైద్య సహాయకులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. 75 శాతం రాయితీపై రైతులకు ఈ గడ్డి విత్తనాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా ఈ నెలాఖరులోగా లక్ష్యం మేరకు 3 నుండి 8 నెలల పెయ్యిలకు బ్రూసిల్లోస్ టీకాలు వేయాలని తెలిపారు. గొర్రె, మేకల్లో పారుడు వ్యాధి రాకుండా ముందస్తుగా పీపీఆర్ వ్యాక్సిన్, తెలుపు రంగు జాతి ఆవులకు లంపీస్కిన్ టీకాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో కొరువాడ పశు వైద్యాధికారి సీహెచ్‌వై నాయుడు, ప్రియాంక, మంజూష పాల్గొన్నారు.